## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



hindustanmedia333@gmail.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దిన పత్రిక

సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 60 ఆదివారం జూన్ 28 2026, పేజీలు - 4 వెల :2/-



## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త.. జూలై 15 నుంచి కొత్త ఆరోగ్య పథకం

-ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన, నగదు రహిత వైద్యమే లక్ష్యం

-ఉద్యోగ దంపతుల్లో ఒకరి జీతం నుంచే కంట్రిబ్యూషన్ వసూలుకు నిర్ణయం

-త్వరలోనే ఆసుపత్రుల జాబితా, ప్యాకేజీ రేట్లను ప్రకటించనున్న ప్రభుత్వం

హిందుస్థాన్ మీడియా




తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన, క్రమబద్ధమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రూపొందించిన నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను జూలై 15న ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సదుపాయం కల్పించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన ఇటీవల జరిగిన ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్ట్ సమావేశంలో పథకం ప్రారంభ తేదీని ఖరారు చేశారు. వారం రోజుల్లోగా వివిధ ఆసుపత్రుల యాజమాన్యాలతో ట్రస్ట్ సభ్యులు కీలక భేటీ నిర్వహించనున్నారు. ఆ తర్వాత నూతన ఈహెచ్ఎస్ మార్గదర్శకాలు, చికిత్సల ప్యాకేజీ ధరలు, ఎంప్యానెల్ చేసిన ఆసుపత్రుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పథకంలో భాగంగా ఉద్యోగు ల ప్రయోజనార్థం ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైన పక్షంలో, వారిలో ఒకరి వేతనం నుంచి మాత్రమే హెల్త్ కంట్రిబ్యూషన్‌ను మినహాయించనున్నారు. ఈ నిర్ణయం వల్ల అటువంటి ఉద్యోగ కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణలో పూర్తి పారదర్శకతను నిర్ధారిస్తూ, ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేకంగా 'ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్'ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ట్రస్ట్ పర్యవేక్షణలోనే నూతన ఆరోగ్య పథకం అమలు కానుంది.

## చినుకుల సాక్షిగా.. ప్రగతి అడుగులు

- వర్షపు జల్లుల మధ్యే కూసుమంచి మండలంలో రూ. 16.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి

- వానాకాలం రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారంగా వంతెనలు.. బీటీ రోడ్లు





హిందుస్థాన్ మీడియా

కూసుమంచి : ఆకాశం నుంచి వర్షపు చినుకులు నేలను తాకుతున్నా.. వాతావరణం అనుకూలించకపోయినా లెక్కచేయకుండా, గ్రామీణ రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయంగా ప్రగతి బాట సాగింది. పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో శనివారం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు చిరుజల్లులు కురుస్తున్నా... వర్షపు చినుకుల సాక్షిగానే దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో రూ. 16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ..


వర్షాకాలంలో తండాలు, పల్లె ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే ఈ పనులను త్వరితగతిన మంజూరు చేయించామని పేర్కొన్నారు. వానలు పడుతున్నా ప్రజల కోసం ప్రగతి పనులు ఆపబోమని, అధికారులు కూడా అంతే వేగంతో నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. రూ. 16.13 కోట్లతో శంకుస్థాపనలు.. మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జడ్పీ రోడ్డు గైగోళ్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో, అలాగే జడ్పీ రోడ్డు నుండి కొత్తూరు - ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్ సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జీళ్ళచెరువు గ్రామంలో జీళ్ళచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్ళే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రెండు వంతెనల (బ్రిడ్జిల) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల జిల్లా, నియోజక, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నల్లగొండలో ట్రాఫిక్ ఆంక్షలు

-ప్రజలు,వాహనదారులు సహకరించాలి

-జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

హిందుస్థాన్ మీడియా




తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఎన్.జి.కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు హాజరుకానున్న నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ,ప్రజల భద్రత,సభకు హాజరయ్యే వారి సౌకర్యార్థం ఈ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. మిర్యాలగూడ, తిప్పర్తి, నకరేకల్ వైపు నుంచి వచ్చే ప్రజలు పానగల్ మీదుగా సభా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. వారి వాహనాల కోసం కళాభారతి,మేకల అభినయ్ స్టేడియం,ఆర్య సమాజ్ ప్రాంగణం,రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాగర్,దేవరకొండ,కనగల్,మునుగోడు ప్రాంతాల నుంచి వచ్చే వారు రూరల్ పోలీస్ స్టేషన్, మునుగోడు బైపాస్ మార్గంలో పట్టణంలోకి ప్రవేశించి, రాఖీల్స్ కాలనీ, వి.టి.కాలనీ, ఎల్.వి.పెట్రోల్ బంక్, ఆర్.ఆర్.ఆర్., రాఘవేంద్ర కాలనీ,రవీందర్ నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలను వినియోగించాలని సూచించారు. ద్విచక్ర వాహనాల కోసం పోలీస్ పరేడ్ గ్రౌండ్,బీట్ మార్కెట్ వద్ద ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. సభా ప్రాంగణానికి వెళ్లే డి.టి.సి., మహిళా ప్రాంగణం,డీఈఓ కార్యాలయం,క్లాక్ టవర్ నుంచి ఎన్.జి.కళాశాల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని, ఈ మార్గంలో సాధారణ వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తామని ఎస్పీ పేర్కొన్నారు. పానగల్ ప్రాంత ప్రజలు రామాలయం-బస్టాండ్ మార్గాన్ని, హైదరాబాద్ రోడ్డు పరిసర ప్రాంత ప్రజలు వివేకానంద విగ్రహం నుంచి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని సూచించారు. సభకు వచ్చే వాహనాలకు మాత్రమే సభా ప్రాంగణం వైపు అనుమతి ఉంటుందని,సాధారణ వాహనాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేలా ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ విజ్ఞప్తి చేశారు.

## ప్రజలపై పన్నుల భారం.. పెట్రోల్ ధరలపై కేంద్రాన్ని నిలదీసిన ఖర్గే

-అంతర్జాతీయంగా క్రూడ్ ధరలు తగ్గినా దేశంలో రేట్లు తగ్గట్లేదన్న ఖర్గే

-ప్రజలను పన్నుల వసూలు వనరులుగా చూస్తున్నారని కేంద్రంపై విమర్శ

-గతంలో కంటే క్రూడ్ ధరలు తగ్గినా ప్రయోజనం లేదని ఆరోపణ

-దేశంలో పలుచోట్ల రూ. 100 దాటిన పెట్రోల్, డీజిల్ ధరలు





హిందుస్థాన్ మీడియా

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా తగ్గినప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను ఎందుకు తగ్గించడం లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను కేవలం పన్నులు వసూలు చేసే వనరులుగానే పరిగణిస్తోందని ఆయన ఆరోపించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నేపథ్యంలో ముడి చమురు బ్యారెల్ ధర 138 డాలర్లకు చేరినప్పుడు, దేశంలో లీటర్ పెట్రోల్ ధర సుమారు రూ. 94.77గా ఉండేదని ఖర్గే గుర్తుచేశారు. ప్రస్తుతం క్రూడ్ ధర 70 నుంచి 82 డాలర్ల మధ్య ఉన్నప్పటికీ, దేశీయంగా పెట్రోల్ ధర రూ. 101 - 111, డీజిల్ ధర రూ. 95 - 100 మధ్య కొనసాగడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పుడు ఆ ప్రయోజనాన్ని ప్రజలకు ఎందుకు బదిలీ చేయడం లేదని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం సామాన్యుల జేబులు ఖాళీ చేస్తూ ప్రజలను దోచుకుంటోందని ఖర్గే ధ్వజమెత్తారు. ప్రజలను కేవలం పన్నుల వసూలు సాధనంగానే కేంద్రం చూస్తోందని మండిపడ్డారు. యుద్ధ వాతావరణాన్ని సాకుగా చూపి కేంద్ర ప్రభుత్వం వాణిజ్య ఎల్పీజీ ధరలను రెట్టింపు చేసిందని, ప్రస్తుతం సరఫరా సాధారణ స్థితికి వచ్చినా ధరలను ఎందుకు తగ్గించడం లేదని ఆయన నిలదీశారు. భారత్ తన చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతుంది. గతంలో చమురు ధరలు పెరిగిన సమయంలో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు భారీ నష్టాలను చవిచూశాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా ధరలు తగ్గినా, గత నష్టాలను పూడ్చుకోవడం, దిగుమతి చేసుకున్న చమురు దేశానికి చేరడానికి పట్టే సమయం, రూపాయి విలువలో హెచ్చుతగ్గులు, అధిక పన్నుల వంటి కారణాల వల్ల దేశీయంగా ధరలు తగ్గడం లేదని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడాలి

-పెంచిన ఎరువుల ,విత్తనాల ధరలను తగ్గించాలి

-యూరియా యాప్ ను తొలగించాలి

-నకిలీ విత్తనాలపై వ్యవసాయ అధికారుల తనిఖీలు ముమ్మరం చేయాలి

హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి (జూన్ 27 2026):

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం కొమరవెల్లి మండల కమిటీ సమావేశం శనివారం రోజున బద్దిపడిగా కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. రైతులపై అనేక భారాలు మోపుతూ ఎరువుల విత్తనాల పురుగుమందుల ధరలను విపరీతంగా పెంచుతూ రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని సిద్దిపేట జిల్లా తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి కొంగరి వెంకట మావో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొంగరి వెంకట మావో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుందని కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాల పేరుతో విదేశీ వ్యవసాయ ఉత్పత్తులను ఎలాంటి సుఖాలు లేకుండా దిగుమతులకు అనుమతి ఇచ్చిందని, నూతన విద్యుత్తు బిల్లు పేరుతో ఉచిత కరెంటుకు మంగళం పాడబోతుందని, రైతుల పొలాల్లోని బోరు బావులకు మీటర్లు బిగించాలనీ సంకల్పిస్తున్నదని, విత్తన చట్టాలను మార్చివేసి మన రాష్ట్ర విత్తన కంపెనీలను విదేశీ కార్పొరేటు మల్టీనేషనల్ కంపెనీలకు అప్పగించాయాని అధిక శాతం నిరక్ష రాశులుగా ఉన్న స్మార్ట్ ఫోన్లు లేని రైతుల ను టెక్నాలజీ ఉపయోగించాలనే విధానాలు తెస్తూ రైతులను తమ పొలాల నుండి దూరం చేస్తూ రైతులను కూలీలుగా మార్చాలని కుట్రలు పన్నుతున్నదని ఇందులో భాగంగా రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం, వ్యవసాయ మార్కెట్ల లో పంటల కొనుగోళ్లను చేపట్టకపోవడం, ఎరువుల, విత్తనాల, పురుగు మందుల ధరలను విపరీతంగా పెంచడం నకిలీ విత్తనాలను, పురుగుమందులను అరికట్టకపోవడం, రైతులు వాడే పనిముట్ల పైన సబ్సిడీలు ఎత్తివేయడం, పంటలకు బోనస్ ప్రకటించి ఇవ్వకపోవడం లాంటి రైతు వ్యతిరేక విధానాలను అవలంబించడం వల్ల రైతులకు వ్యవసాయం భారంగా మారిపోయిందని ఈ విధానాలు అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైన వత్తిడి తెచ్చేందుకు రైతులకు సానుకూల పరిస్థితులు రావడం కోసం రైతాంగం ఏకమై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాడూరి రవీందర్, తెలంగాణ రైతు సంఘం కొమరవెల్లి మండల కమిటీ




సభ్యులు బోడిగం సురేందర్ రెడ్డి, పాకనాటి బాల నర్సయ్య, దాసరి బాలస్వామి, తడకపల్లి శ్రీనివాస్ సున్నం యాదగిరి తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వెంకట్ మావో కొమురవెల్లి మండల అధ్యక్షుడు బద్దిపడే కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పెరుగు తున్న ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్ల ఏర్పాటు రైతులపై అదనపు భారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టి, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. అక్రమ లైసెన్సులతో నడుస్తున్న విత్తనాలు, ఎరువుల దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుని రైతుల ప్రయోజనాలను కాపాడాలని సమావేశం డిమాండ్ చేసింది.

# భార్య జ్ఞాపకార్థం విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

రేబర్తి, జూన్ 27 (హిందుస్థాన్ మీడియా):

సిద్దిపేట జిల్లా రేబర్తి గ్రామ సర్పంచ్ నిరటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మెరుగు శివలింగం తన దివంగత భార్య మెరుగు సుగుణ జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు. ఓపీపీఎస్ రేబర్తి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 110 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు నోటు పుస్తకాల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. దివంగత సుగుణ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని గ్రామ స్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బియ్య రమేష్, వార్డు సభ్యులు, ఎంపీపీఎస్ రేబర్తి ప్రధానోపాధ్యాయురాలు జయశ్రీ, జడ్పీహెచ్ఎస్ రేబర్తి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రబాను, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు మెరుగు శివలింగం




కుటుంబ సభ్యులను అభినందిస్తూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత కొనసాగాలని ఆకాంక్షించారు

# నర్సాయపల్లి గ్రామ అభివృద్ధే నా లక్ష్యం

-గ్రామాభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించిన సర్పంచ్ శనిగరం సత్యనారాయణ

మద్దూరు, జూన్ 27 (హిందుస్థాన్ మీడియా):

నర్సాయపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మద్దూరు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, నర్సాయపల్లి గ్రామ సర్పంచ్ శనిగరం సత్యనారాయణ అన్నారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, వీధి విద్యుత్ దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, వనమహోత్సవం సందర్భంగా మొక్కల నాటకం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను సెప్టెంబర్ 15లోపు పూర్తి చేయడం, ఐహెచ్‌హెచ్ఎల్ పథకం కింద లబ్ధిదారులకు రూ.12 వేల ప్రోత్సాహకం అందేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై చర్చించారు. అలాగే గ్రామంలో కొనసాగుతున్న మహిళా భవనం, గ్రామ పంచాయతీ భవనం, పిట్టలగూడెం ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, త్రీ-ఫేజ్ మోటార్ పైప్‌లైన్‌ను నీటి ట్యాంకుకు అనుసంధానం, పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయడం వంటి అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ



సమావేశంలో ఉప సర్పంచ్ మంతెన భరత్ రెడ్డి, వార్డు సభ్యులు పోతుగంటి విజయ, ముస్త్రాల గీత, రాగుల బాలనర్సయ్య, దోప్ప కిషన్, చల్ల సంతోష్ రెడ్డి, తుమ్మల శ్రీను, గ్రామ పంచాయతీ కార్యదర్శి పి. భాస్కర్ పాల్గొన్నారు.

# కొమురవెల్లి మండల కేంద్రంలో ఘనంగా నిశ్చితార్థ వేడుక

హిందూస్తాన్ మీడియా, కొమురవెల్లి:

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలోని పద్మశ్రీ గార్డెన్స్‌లో శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థాన మాజీ ధర్మకర్త ముత్యం నర్సింలు గౌడ్ చెల్లెలు మాంకాల పద్మ -- బాబు దంపతుల చిన్న కుమార్తె వినీల ను, గురువన్నపేట గ్రామానికి చెందిన పద్మ -- కీర్తిశేషులు బుడిగ వెంకటేశం ద్వితీయ పుత్రుడు సంజు గౌడ్ తో నిశ్చితార్థ వేడుక శనివారం రోజు ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసం తోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్రి పోతుల నర్సింలు, నాయకులు ముత్యం అంజయ్య గౌడ్, బొచ్చు ఎల్లయ్య యాదవ్, ఎరుపుల రాజు,



గోదల నవీన్, చింతల రమేష్ రాజ్, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తాం

-జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి

మద్దూరు, జూన్ 27 (హిందుస్థాన్ మీడియా):

ఎరువుల విక్రయాలు తప్పనిసరిగా ఈ-పాస్ (e-POS) యంత్రం ద్వారానే నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లపై కఠిన చర్యలతో పాటు అవసరమైతే లైసెన్సులు కూడా రద్దు చేస్తామని సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి హెచ్చరించారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలోని సంతోషిమాత ఎరువుల దుకాణం, లక్ష్మీ ట్రేడర్స్, సహస్ర ఎరువుల దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతిసారీ తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. డీలర్లు దుకాణాల్లో ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించి, ప్రతి విక్రయానికి బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే అన్ని ఎరువుల విక్రయాలు ఈ-పాస్ యంత్రం ద్వారానే నిర్వహి ంచాలని, నిబంధనలను ఉల్లంఘించి విక్రయాలు నిర్వహిస్తే సంబంధిత డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సు రద్దు చేసే వరకు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా



వ్యవసాయ అధికారి స్వరూప రాణి, మండల వ్యవసాయ అధికారి అఫ్రోజ్, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజు, కల్పన తదితరులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

# హిందుస్థాన్ మీడియా కథనంతో కదిలిన అధికారులు..

-హిందుస్థాన్ మీడియా ఎఫెక్ట్

-చెట్ల కొమ్మల తొలగింపు పూర్తి

చేర్యాల:

హిందుస్థాన్ మీడియా ప్రచురించిన "చెట్ల కొమ్మల తొలగింపులో నిర్లక్ష్యం.. ప్రజలకు ఇబ్బందులు" అనే కథనానికి మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని రహదారి పక్కన ప్రమాదకరంగా పేరుకుపోయిన చెట్ల కొమ్మలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. దీంతో వాహనదారులు, స్థానిక వ్యాపారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. హిందుస్థాన్ మీడియా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తోందని స్థానికులు అభినందించారు. సమస్యను గుర్తించి వెంటనే చర్యలు తీసుకున్న మున్సిపల్ కమిషనర్, పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు కృతజ్ఞతలు



హిందుస్థాన్ మీడియా కథనం అనంతరం చెట్ల కొమ్మలను తొలగించిన ప్రాంతం.

తెలిపారు.

# పిడుగు పడి నాలుగు గొర్రెలు మృతి

-కూటిగల్ గ్రామంలో నిరుపేద గొర్రెల కాపరులకు తీరని నష్టం



మద్దూరు/దూల్మిట్ట, జూన్ 27 (హిందుస్థాన్ మీడియా):

సిద్దిపేట జిల్లా మద్దూరు--దూల్మిట్ట మండల పరిధిలోని కూటిగల్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండగా పిడుగు పడి నాలుగు గొర్రెలు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన వడ్ల మైసమ్మ మరియు నారదాసు ఉపేందర్కు చెందిన గొర్రెల దొడ్డిపై పిడుగు పడటంతో నాలుగు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనతో గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబాలకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## రైతు భరోసా-2026కు జూలై 5లోపు దరఖాస్తు చేసుకోవాలి:

-మద్దూర్ మండల వ్యవసాయ అధికారి బి. రామకృష్ణ

మద్దూరు, జూన్ 27 (హిందుస్థాన్ మీడియా):



మద్దూరు మండలంలోని అర్హులైన రైతులు రైతు భరోసా--2026 పథకం కోసం జూలై 5లోపు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి. రామకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 15లోపు కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులు రైతు భరోసా పథకం ప్రయోజనాలు పొందేందుకు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే రైతులు అప్లికేషన్ ఫారం, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులతో మండలంలోని రైతు వేదికలో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని కోరారు. అర్హులైన రైతులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకుని పథకం ప్రయోజనాలను పొందాలని మండల వ్యవసాయ అధికారి బి. రామకృష్ణ సూచించారు.

# పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ప్యాడ్లు అందించిన వంగపల్లి విజయ్




చేర్యాల, జూన్ 27 (హిందుస్థాన్ మీడియా):

చేర్యాల పట్టణానికి చెందిన వంగపల్లి విజయ్ (వీరభద్ర బుక్ డిపో) తన పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు, బహుమతులు పంపిణీ చేసి సామాజిక సేవా భావాన్ని చాటుకున్నారు. జడ్పీహెచ్ఎస్ నాగపురి పాఠశాలలో తన స్నేహితుడు, సంఘసేవకుడు అందే విజయ్ కుమార్ ద్వారా విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేయడంతో పాటు, నూతనంగా పాఠశాలలో చేరిన 40 మంది విద్యార్థులకు స్కూల్ ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలికట్టే ఐలయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఈ విధంగా ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. వంగపల్లి విజయ్ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షిస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. కృష్ణమూర్తి, టి. పద్మ, ఏ. విజయ్ కుమార్, టి. మనోజ్, కె. మాధవి, కె. సర్వకుమార్, పి. రాజేశ్వరి, ఎస్. కనకలింగం, జి. శ్రీధర్, స్వామి, ఎండీ. ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

## సమృద్ధిగా వర్షాలు కురవాలని అంబాత్రయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

మద్దూరు, జూన్ 27 (హిందుస్థాన్ మీడియా)



రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలోని బిజ్వర్ గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ అంబాత్రయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిశక్తి పీఠంలోని మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, నదులు, జలాశయాలు నిండి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత, కురుమ సంఘం రాష్ట్ర నాయకులు శెవల్ల రాజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తొల్లా సత్యం, ఆకునూర్ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ మంతపురి లక్ష్మణ్, జర్నలిస్ట్ గణేష్ తివారి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్షేత్ర పీఠాధిపతి డాక్టర్ ఆదిత్య పరాశ్రీ గురుదేవుల ఆశీస్సులు స్వీకరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి దైవానుగ్రహం అవసరమని వారు పేర్కొన్నారు.

# బిజినెస్

## డేటా సెంటర్లలోకి బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్





హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీ సంస్థ బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ లిమిటెడ్ (బీసీఎ?సఎ?సఎల్) డేటా సెంటర్ల వ్యాపారంలోకి అడుగుపెట్టింది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఒడిశాలోని గోపాల్‌పూర్ వద్ద 100 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సీఈఓ చంద్రశేఖర్ ముద్రగణం వెల్లడించారు. ఈ డేటా సెంటర్ కోసం మూడు దశల్లో 35 కోట్ల డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన వివరించారు. తదుపరి దశ విస్తరణలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో డేటా సెంటర్లను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. కాగా 2025-26లో కంపెనీ ఆదాయం రూ.1,002 కోట్లుగా ఉండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో రూ.3,000 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చంద్రశేఖర్ వెల్లడించారు. బ్లూ క్లౌడ్.. హెల్త్‌కేర్ విభాగంలో బ్లూహెల్త్, బ్లూకియోస్క్, బ్లూబయో, బయోస్టర్, బ్లూహెల్త్ పేరుతో పలు ఏఐ ఆధారిత సేవలందిస్తోందని చంద్రశేఖర్ వివరించారు. కంపెనీ హెల్త్‌కేర్ విభాగం.. క్యాన్సర్ సంబంధిత పరిశోధనల కోసం రూ.400 కోట్ల పెట్టుబడితో ఏపీలోని గుంటూరులో బయోబ్యాంక్‌ను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కాగా కంపెనీ కార్యకలాపాల విస్తరణ కోసం భారత్‌తో పాటు ఆఫ్రికాలోని పలు దేశాలపై దృష్టి సారిస్తున్నట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# ఏఐతో భారత ఐటీకి కాసుల పంట!

న్యూఢిల్లీ:

సంప్రదాయ ఐటీ కంపెనీల సేవలను కృత్రిమ మేధ (ఏఐ) భర్తీ చేయవచ్చన్న ఆందోళనలను పరిశ్రమ నిపుణులు తోసిపుచ్చారు. భవిష్యత్‌లో భారత ఐటీ రంగానికి ఏఐ భారీగా ఆదాయం సమకూరనుందని న్యూయార్క్‌లో జరిగిన నాస్కామ్ యూఎస్ సీఈఓ ఫోరమ్‌లో వారన్నారు. ఏఐ యుగంలో కంపెనీల డిజిటల్ పరివర్తనానికి ఐటీ రంగం కీలకమని వారు పేర్కొన్నారు. దేశీయ ఐటీ కంపెనీలు ఏఐ సేవల ద్వారా ఇప్పటికే 1,000-1,200 కోట్ల డాలర్ల (రూ.95,000-1,14,000 కోట్లు) మేర ఆదాయాన్ని గడిస్తున్నాయని, దాదాపు 25 శాతం కంపెనీల ఏఐ ప్రయోగాలు ఉత్పత్తి దశకు చేరుకున్నాయని ఇండస్ట్రీ అసోసియేషన్ నాస్కామ్ తెలిపింది. ఈ అసోసియేషన్ ఇంకా ఏమన్నదంటే. ఏఐ ఉత్పాదకత ప్రయోజనాలను అందించడంతో పాటు ప్రామాణిక, పునరావృత పనులను కుదిస్తుంది. అలాగే, సాంకేతిక సమన్వయం,డేటా సంసిద్ధత, అప్లికేషన్ మోడ్రనైజేషన్, ఏఐ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఏజెంట్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఇండస్ట్రీ ఆధారిత పరిష్కారాలకు గిరాకీని విస్తరింప ˇజేయనుంది. ఇప్పటికే 20 లక్షలకు పైగా ఐటీ ఇంజనీర్లు ఏఐలో నైపుణ్యం కలిగి ఉన్నారు. 1-2 లక్షల మంది అడ్వాన్స్‌డ్ ఏఐలో శిక్షణ తీసుకున్నారు. దాదాపు 85 శాతం టెక్నాలజీ సేవల కంపెనీలు ఏజెంటిక్ ఏఐ ప్లాట్‌ఫామ్స్‌ను కలిగి ఉన్నాయి.




ఏజెంటిక్ ఏఐ సేవలు ఐటీ కంపెనీలకు 2030 నాటికి 30,000 -40,000 కోట్ల డాలర్ల (రూ.28.50-38 లక్షల కోట్లు) ఆదాయ అవకాశాలను సృష్టించే అవకాశాలున్నాయి.ఐటీ రంగ విస్తరణలోనూ సమూల మార్పులు జరగనున్నాయి. భవిష్యత్ వృద్ధి సిబ్బంది పెంపుపై తక్కువగా.. ప్లాట్‌ఫామ్స్, డొమైన్ సొల్యూషన్స్, ప్రొప్రైటరీ అసెట్స్, అవుట్‌కమ్ ఆధారిత డెలివరీపై అధికంగా ఆధారపడనుంది. బిజినెస్ ప్రాసెస్ సేవలు ప్రస్తుత లావాదేవీల ఎగ్జిక్యూషన్ నుంచి ఇంటెలిజెన్స్ ఆపరేషన్స్‌కు మారనున్నాయి. సిబ్బంది కేవలం పర్యవేక్షణ, ఎక్సెప్షన్ హ్యాండ్లింగ్, అనలిటిక్స్, డిసిషన్ సపోర్ట్‌కు మాత్రం పరిమితం కానున్నారు.

# చల్లారుతున్న చమురు మంట

న్యూఢిల్లీ:

పెరుగట విరుగుట కొరకే అనే సామెత ముడి చమురు ధర విషయంలో మరోసారి రుజువవుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడితో చుక్కలంటిన ముడి చమురు ధర ప్రస్తుతం నేలచూపులు చూస్తోంది. శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్లో బ్యారల్ బ్రెంట్ రకం ముడి చమురు ధర 70 డాలర్లకు దిగి వచ్చింది. ఒక దశలో ఇది 69 డాలర్లకు చేరి ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. ఇది ఏడాది ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభమైనపుడు ఉన్న ధర కంటే తక్కువ.

**-మరింత కిందికి!**

తీవ్ర బేరసారాల తర్వాత ఎట్టకేలకు అమెరికా-ఇరాన్ మధ్య 60 రోజుల శాంతి ఒప్పందం కుదిరింది. దీంతో ఇరాన్ కూడా తన వద్ద భారీగా పేరుకుపోయిన చమురును ఎగుమతి చేసేందుకు సిద్ధమవుతోంది. ఇరాన్ పెట్రోలియం శాఖ మంత్రి ఇందుకోసం ఇటీవలే మన దేశానికి వచ్చి వెళ్లారు. పశ్చిమాసియాలోని ఇతర దేశాలతో పోలిస్తే బ్యారల్‌కు 3 నుంచి 4 డాలర్ల డిస్కౌంట్‌తో భారత్‌కు చమురు సరఫరా చేసేందుకు సిద్ధమని ఈ పర్యటనలో ఆయన భారత్‌కు ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు యుద్ధం చల్లారడంతో ఇతర గల్ఫ్ దేశాలూ భారీగా చమురు ఎగుమతులకు సిద్ధమయ్యాయి. దీంతో త్వరలోనే బ్యారల్ చమురు ధర 60 నుంచి 65 డాలర్లకు దిగి వచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.




**-వృద్ధికి ఊతం**

ఈ యుద్ధంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు అంచనాలను అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థలు 6.5 శాతానికి కుదించేశాయి. ఇప్పుడు యుద్ధం చల్లారడంతో అంతర్జాతీయ ఇనట?వ్స్టమెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్.. భారత జీడీపీ వృద్ధి రేటును 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచింది. రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాలనీ 4.6 శాతం నుంచి 4.4 శాతానికి కుదించింది. కరెంట్ ఖాతా లోటు (సీఏడీ) జీడీపీలో 1.1 శాతం మించక పోవచ్చని తెలిపింది.

# అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీ రద్దు.. ఎందుకంటే!

స్పోర్ట్స్ డెస్క్:

ఐర్లాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత్ జట్టు ఘోరంగా ఓడిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రమే రాణించాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఈ ఓపెనింగ్ బ్యాటర్ మాత్రం దూకుడుగానే ఆడుతూ స్కోరు బోర్డుపై పరుగులు జమ చేశాడు. ఈ క్రమంలోనే అభిషేక్ శర్మ 19 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. ఇందుకు సంబంధించిన బీసీసీఐ ట్వీట్ కూడా చేసింది.అభిషేక్ శ్మర సైతం తన కెరీర్‌లోని మరో హాఫ్ సెంచరీని చేసినట్లు సెలబ్రేట్ చేసుకున్నాడు. అయితే, ఆ వెంటనే 7.6వ ఓవర్‌లో లియామ్ మెకర్తీ బౌలింగ్‌లో బెంజమిన్‌కు క్యాచ్ ఇచ్చి అభిషేక్ శర్మ పెవిలియన్‌కు చేరాడు. ఇక్కడే ఓ ట్విస్ట్ చోటుచేసుకుంది. అభిషేక్ శర్మ చేసిన అర్ధ సెంచరీ రద్దైంది. అతడి హాఫ్ సెంచరీని రద్దు చేసినట్లు స్కోరు బోర్డులో రివైజ్డ్ స్కోరు వచ్చింది. దీంతో కాసేపు అభిమానులు షాకయ్యారు. ఇందుకు కారణం మూన్‌డ్రా బౌలింగ్ (భారత్ ఇన్నింగ్స్ 5వ ఓవర్)లో అభిషేక్ శర్మ సింగిల్ తీశాడు. అయితే, ఆ తర్వాత అది లెగ్‌బైగా తేలింది.



# యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ సెమీస్‌కు రౌనక్

స్పోర్ట్స్ డెస్క్:

యూఎస్ ఓపెన్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు అదరగొట్టేస్తున్నారు. పురుషులు, మహిళల విభాగంలో ముగ్గురు ప్లేయర్లు సెమీస్‌కు దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్‌లో దేవికా సిహాగ్ విజయం సాధించగా.. పురుషుల విభాగంలో కిదాంబి శ్రీకాంత్, రౌనక్ చౌహాన్ సెమీ ఫైనల్స్‌లో అడుగు పెట్టారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 18 ఏళ్ల యువ షట్లర్ రౌనక్ చౌహాన్ ఇప్పుడు బ్యాడ్మింటన్‌లో హాట్ టాపిక్‌గా మారాడు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్, 6వ ర్యాంకర్ అయిన టియెన్ చెన్‌ను వరుస గేమ్‌లలో 21-17, 26-24 తేడాతో ఓడించి రౌనక్.. క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. క్వార్టర్స్‌లోనూ కేవలం 38 నిమిషాల్లోనే ఇజ్రాయెల్ టాప్ ప్లేయర్ మిషా జిల్బెర్‌మన్‌ను చిత్తు చేశాడు. 23-21, 21-11 తేడాతో విజయం సాధించాడు. దీంతో తొలిసారి మెగా టోర్నీ సెమీస్‌లో అడుగు పెట్టాడు. మరో సింగిల్స్‌లో సీనియర్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ 21-9, 12-21, 21-8 తేడాతో చైనీస్ తైపీ ప్లేయర్ లియావో జౌపును ఓడించాడు. ఇవాళ జరగనున్న సెమీస్‌లో జపాన్‌కు చెందిన నాలుగో సీడ్ యుద్దై ఒకిమోటోతో శ్రీకాంత్ తలపడతాడు. మహిళల సింగిల్స్‌లో దేవిక మరోసారి నిలకడైన ప్రదర్శనతో జపాన్ ప్లేయర్ రికో గుంజిని 22-20, 21-19 తేడాతో ఓడించింది. రెండు గేమ్‌ల చివరి దశల్లోనూ సంయమనం కోల్పోకుండా ఆడిన దేవిక..డెన్మార్క్ క్రీడాకారిణి లైన్ క్రిస్టోఫర్సన్‌తో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది.



# స్పోర్ట్స్

## ఫిఫా ప్రపంచ కప్ 2026: చరిత్ర సృష్టించిన కాబో వెర్డె




స్పోర్ట్స్ డెస్క్:

ఫిఫా ప్రపంచ కప్ 2026లో సంచలనం నమోదైంది. ఆఫ్రికా ఖండంలోని అతి చిన్న దేశాల్లో ఒకటైనా కాబో వెర్డె ఫిఫా వరల్డ్ కప్‌లో చరిత్ర సృష్టించింది. కేవలం 5.30 లక్షల జనాభా కలిగిన ఈ చిన్న దేశం ఇప్పుడు వరల్డ్ కప్ నాకౌట్‌కు చేరుకుని అందరిన ఆశ్చర్యానికి గురి చేసింది. 2010లో స్లోవేకియా తర్వాత ప్రపంచ కప్‌లో గ్రూప్ దశ నుంచి ముందంజ వేసిన తొలి అరంగేట్ర జట్టుగా కాబో వెర్డె నిలిచింది. అలాగే 2006లో ఘనా తర్వాత నాకౌట్‌కు చేరిన తొలి ఆఫ్రికన్ జట్టు కూడా ఇదే కావడం విశేషం.తొలిసారి ఫిఫా ప్రపంచ కప్ టోర్నీ బరిలోకి దిగిన ఈ జట్టు.. ఆడిన మూడు మ్యాచుల్లో ఒక్కదాంట్లో కూడా విజయం సాధించలేదు. అయినా, రౌండ్ 32కు చేరుకొని వార్తల్లోకెక్కింది. గ్రూప్-హెచ్‌లో స్పెయిన్, ఉరుగ్వే, సౌదీ అరేబియా జట్లతో కాబో వెర్డె బరిలోకి దిగింది. స్పెయిన్ మూడు మ్యాచుల్లో రెండు విజయాలు, ఒక డ్రాతో అగ్రస్థానంలో నిలిచింది. కాబో వెర్డె మాత్రం ఆడిన మూడు డ్రాలు చేసుకుని రెండో స్థానంతో నాకౌట్‌కి చేరింది. నాకౌట్‌లో జులై 3న బలమైన అర్జెంటీనాతో ఈ జట్టు తలపడనుంది.మరోవైపు స్పెయిన్ చేతిలో 1-0 తేడాతో ఉరుగ్వే ఓటమిపాలైంది. దీంతో సౌదీ అరేబియాతోపాటు ఉరుగ్వే ఇంటిముఖం పట్టాయి. అలానే ఫిఫా ప్రపంచ కప్‌లో ఫ్రాన్స్ దూసుకెళ్తోంది. హ్యాట్రిక్ విజయాలతో గ్రూప్-ఐ లో అగ్రస్థానంతో నాకౌట్‌కు చేరుకుంది. ఇవాళ జరిగిన మ్యాచ్‌లో 4-1 తేడాతో నార్వేపై విజయం సాధించింది. ఇదే గ్రూప్ నుంచి సెనెగల్ 5-0 తేడాతో ఇరాక్‌ను ఓడించింది. దీంతో ఫ్రాన్స్, నార్వే, సెనెగల్ నాకౌట్‌కు చేరుకున్నాయి.

# విజయ్ సీఎం అయితే రజనీకాంత్ కంగ్రాట్స్ చెప్పలేదని ట్రోల్స్– విష్ణు విశాల్ ఫైర్

-విజయ్ సీఎం అయితే తనకు అసూయ ఎందుకుంటుందన్న రజనీ
-రజనీలాంటి గొప్ప వ్యక్తి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చిందంటూ విష్ణు విశాల్ ఫైర్
-మౌనాన్ని వ్యక్తిగత శత్రుత్వంగా మార్చి చూడొద్దని హితవు



దళపతి విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సూపర్ స్టార్ రజనీకాంత్ ఆయనకు కంగ్రాట్స్ చెప్పలేదంటూ సోషల్ మీడియాలో నెగెటివ్ ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, రజనీకాంత్ మీడియా ముందుకు వచ్చి "విజయ్ సీఎం అయితే నాకెందుకు అసూయ ఉంటుంది? నేను ఏం మాట్లాడినా తప్పుగా అర్థం చేసుకుంటున్నారు" అంటూ అసహనం వ్యక్తం చేయాల్సి వచ్చింది. తాజాగా ఈ ఇష్యూపై కోలీవుడ్ నటుడు విష్ణు విశాల్ తీవ్రంగా స్పందించారు. తన తాజా చిత్రం 'మట్టి కుస్తీ 2' ప్రమోషన్స్ వేదికగా విష్ణు విశాల్ స్పందిస్తూ... నాలుగు రోజులు ఎవరైనా సెలబ్రిటీ మౌనంగా ఉంటే చాలు.. సొంతంగా ఊహాగానాలు రాసేస్తున్నారని మండిపడ్డారు. కొన్ని విషయాల్లో రజనీకాంత్ సైలెంట్‌గా ఉన్నందుకు ఆయనపై నెగెటివిటీ స్ప్రెడ్ చేశారని విమర్శించారు. చివరకు తలైవా మైక్ ముందుకు వచ్చి... తనకు విజయ్‌పై ఎలాంటి కుళ్లు లేదని క్లారిటీ ఇచ్చుకోవాల్సి రావడం చాలా బాధాకరమన్నారు. భారతీయ సినీ రంగంలో రజనీకాంత్ సాధించిన విజయాలు, ఆయన ఇమేజ్ వేరే లెవెల్ అని విష్ణు చెప్పారు. అలాంటి గొప్ప వ్యక్తికి ఇంకొకరిపై అసూయ ఉందనడం సరి కాదని అన్నారు. సినిమా రంగంలో ఉండే మౌనాన్ని వ్యక్తిగత శత్రుత్వంగా మార్చి చూడొద్దని సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లకు విజ్ఞప్తి చేశారు.

## కుమార్తె అవంతిక పెళ్లి... ఖుష్బూ భావోద్వేగ పోస్ట్



ప్రముఖ నటి, బీజేపీ నేత ఖుష్బూ సుందర్ ఇంట పెళ్లి బాజాలు మోగడం తెలిసిందే. ఖుష్బూ కుమార్తె అవంతిక సుందర్‌కు శ్రావణ్ శ్రీనివాసన్‌తో వివాహం జరిగింది. ఈ సంతోషకరమైన వార్తను పంచుకుంటూ ఖుష్బూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘమైన, భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆనందంతో తమ కళ్లు చెమర్చాయని, ఇది తమ జీవితంలో మర్చిపోలేని మధుర క్షణమని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. "ఈ సమయంలో ఆనందంతో మాకు మాటలు రావడం లేదు. తల్లిదండ్రులుగా, కుటుంబమే మాకు సర్వస్వం. పెళ్లిళ్లు స్వర్గంలో నిశ్చయమవుతాయని మేము నమ్ముతాం. మా ప్రియ కుమార్తె అవంతిక సుందర్‌కు, శ్రావణ్ శ్రీనివాసన్‌కు 2026 జూన్ 25న వివాహం జరిగిందని తెలియజేస్తున్నాం" అని ఆమె పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల ప్రేమ, ఆప్యాయతల మధ్య ఈ వివాహ వేడుక జరిగిందని, అందరి ఆత్మీయత ఈ వేడుకను ఎంతో మ్యాజికల్‌గా మార్చిందని ఖుష్బూ వివరించారు. ఇది చాలా కొద్దిమందితో, నిరాడంబరంగా జరుపుకున్న వేడుక అని, తమ పిల్లలు కోరుకున్నట్టే ఈ పెళ్లిని జరిపించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు.

## వైజాగ్‌లో 'మా ఇంటి బంగారం' విజయోత్సవంసీక్వెల్ ఉంటుందని ప్రకటన



నటి సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం ఘన విజయం సాధించిన సందర్భంగా చిత్ర బృందం విశాఖపట్నంలో విజయోత్సవ వేడుకను నిర్వహించింది. శుక్రవారం సాయంత్రం ఆర్‌కే బీచ్ సమీపంలోని గోకుల్ పార్క్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి సందడి చేశారు. ఇదే వేదికపై సినిమాకు సీక్వెల్ ఉంటుందని నిర్మాత రాజ్ నిడిమోరు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ, సినిమా విడుదలకు ముందు ఫలితంపై కొంత ఆందోళన చెందినప్పటికీ, ప్రేక్షకులు ఈ చిత్రాన్ని విశేషంగా ఆదరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనారోగ్యం తర్వాత తాను తిరిగి సినిమాల్లో నటించడానికి తన భర్త, నిర్మాత రాజ్ నిడిమోరు అందించిన ప్రోత్సాహం మరువలేనిదని ఆమె పేర్కొన్నారు. విశాఖ ప్రజలు తనపై ఎల్లప్పుడూ చూపే ప్రత్యేక అభిమానాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.


## ప్రముఖ నటుడు, దర్శకుడు భాగ్యరాజ్ కన్నుమూత

-చెన్నైలో గుండెపోటుతో తుదిశ్వాస
-25కు పైగా చిత్రాలకు దర్శకత్వం
-75కు పైగా సినిమాల్లో నటన
-తెలుగులోనూ నటించిన దిగ్గజం
-ఎంజీఆర్ వారసుడిగా ప్రశంసలు
-ఆఖ్రీ రాస్తాతో హిందీలోనూ గుర్తింపు

ప్రముఖ తమిళ దర్శకుడు, నటుడు, కథా రచయిత కె. భాగ్యరాజ్ (73) గుండెపోటుతో చెన్నైలో కన్నుమూశారు. ఇటీవలే ఆయన నటి ఖుష్బూ కుమార్తె వివాహ వేడుకకు గోవాలో హాజరయ్యారు. ఇంతలోనే తుదిశ్వాస విడవడం సినీ పరిశ్రమను విషాదంలోకి నెట్టింది. తమిళనాడులోని ఈరోడ్ జిల్లాలో భాగ్యరాజ్‌గా జన్మించారు. ప్రముఖ దర్శకుడు భారతీరాజా వద్ద సహాయ దర్శకుడిగా సినీ ప్రయాణం ప్రారంభించారు. అనంతరం దర్శకుడిగా, కథా రచయితగా, నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. మధ్యతరగతి కుటుంబాల జీవనశైలిని ప్రతిబింబించే కథలు, సహజమైన సంభాషణలు, భావోద్వేగాలతో కూడిన చిత్రాలకు ఆయన పెట్టింది పేరు. 1980, 1990 దశకాల్లో తమిళ సినీ పరిశ్రమలో అత్యంత విజయవంతమైన దర్శకుల్లో ఒకరిగా నిలిచారు. కెరీర్‌లో 25కు పైగా చిత్రాలకు భాగ్యరాజ్ దర్శకత్వం వహించారు. 75కిపైగా సినిమాల్లో నటించారు. ముందానై ముడిచ్చు, అంధా 7 నాట్కల్, డార్లింగ్ డార్లింగ్ డార్లింగ్ వంటి చిత్రాలు ఆయనకు చిరస్థాయి గుర్తింపు తెచ్చాయి. తెలుగులోనూ కుబేర, 35, సీత, రెడ్ అలర్ట్, మేం వయసుకు వచ్చాం వంటి చిత్రాల్లో మెరిశారు. హిందీలోనూ ఆఖ్రీ రాస్తా చిత్రానికి దర్శకత్వం వహించారు. అమితాబ్ బచ్చన్, శ్రీదేవి, జయప్రద ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. భాగ్యరాజ్ సేవలను గుర్తించిన అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు ఎంజీఆర్.. సినీ రంగంలో తన వారసుడిగా ఆయనను ప్రశంసించడం విశేషం. భాగ్యరాజ్‌కు భార్య పూర్ణిమ భాగ్యరాజ్, కుమారుడు శంతను భాగ్యరాజ్, కుమార్తె శరణ్య ఉన్నారు.



# 'బ్లాస్ట్' మూవీ రివ్యూ!




కోలీవుడ్ నుంచి ఒక యాక్షన్ థ్రిల్లర్ ఇటీవల థియేటర్లకు వచ్చింది. అర్జున్ .. అభిరామి .. ప్రీతి ముకుందన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఆ సినిమా పేరే 'బ్లాస్ట్'. ఏజీఎస్ బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమాకి సుభాష్ కె రాజ్ దర్శకత్వం వహించాడు. తెలుగులో ఈ సినిమాకి పెద్దగా పబ్లిసిటీ లేకపోవడం వలన, ఆశించిన స్థాయి రెస్పాన్స్ కనిపించలేదు. అయితే తమిళనాట మాత్రం ఈ సినిమా మంచి వసూళ్లను రాబట్టింది. 18 కోట్లతో నిర్మితమైన ఈ సినిమా, ప్రపంచవ్యాప్తంగా 70 కోట్లకి పైగా వసూళ్లను సాధించింది. అలాంటి ఈ సినిమా 5 భాషల్లో ఈ నెల 25 నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. రాజారామ్ (అర్జున్) అతని భార్య నీలవేణి (అభిరామి) కూతురు 'నీల' (ప్రీతీ ముకుందన్) తమ్ముడు ఈశ్వర్ ( వివేక్ ప్రసన్న) కలిసి నివసిస్తూ ఉంటారు. రాజారామ్ అతని భార్య ఇద్దరూ కూడా మార్షల్ ఆర్ట్స్ కుటుంబాల నుంచి వచ్చినవారే. ఇద్దరికీ మార్షల్ ఆర్ట్స్ లో మంచి ప్రవేశం ఉంటుంది. అందువలన తమ కూతురు 'నీల'కి కూడా మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తారు. అవమానం .. అన్యాయం జరిగినప్పుడు ఎలా రియాక్ట్ కావాలనేది తండ్రి నుంచి 'నీల' నేర్చుకుంటుంది. రాజారామ్ చిన్న పిల్లలకు కరాటేలో శిక్షణ ఇస్తుంటాడు. ఆయన భార్య మిషన్ కుడుతుంటుంది. 'నీల' ఒక వైపున జాబ్ చేస్తూనే .. మరో వైపున మెడికల్ షాప్ లో బాబాయ్ కి సాయం చేస్తుంటుంది. ఇది ఇలా ఉండగా వరుణ్ దయాళన్ (జాన్ కొక్కేన్) 7వేల కోట్ల ప్రాజెక్టు ఒకటి ప్లాన్ చేస్తాడు. ఆ ప్రాజెక్టు కారణంగా 800 వందల కుటుంబాలు నివసించే ఒక చిన్నపాటి గ్రామం సమాధి అవుతుంది. ఆ ప్రాజెక్టు ముందుకు వెళ్లడానికి ఒక మినిస్టర్ కి వరుణ్ వెయ్యి కోట్లు లంచంగా ఇవ్వాల్సి వస్తుంది. వాటిని మినిస్టర్ ట్రస్ట్ పేరుతో ఉన్న ఎకౌంట్ కి 'వైట్' గా పంపించడం కోసం వరుణ్ ఏర్పాటు చేస్తాడు. అందుకోసం మూడు అంచెల పద్ధతిలో కృపాలన్ .. అబ్రహం .. శివ అనే ముగ్గురు అనుచరులను నియమిస్తాడు. ఆ వెయ్యి కోట్లకి సంబంధించిన 'కోడ్' గా ఒక 100 రూపాయల నోటు ఉంటుంది. అది అబ్రహం దగ్గర ఉంటుంది. అయితే ఒక చిన్న పొరపాటు కారణంగా అది 'శివ' పర్స్ లోకి వెళుతుంది. అనుకోకుండా పోలీసులకు పట్టుబడిన అబ్రహం, గాయాలతో అక్కడి నుంచి తప్పించుకుంటాడు. అతనికి అవసరమైన టాబ్లెట్స్ కోసం ఈశ్వర్ మెడికల్ షాప్ కి వెళ్లిన టోబీ, అక్కడున్న 'నీల'తో గొడవ పడతాడు. అది కాస్తా కృపాలన్ గ్యాంగ్ రాజారామ్ ఇంటిని వెతుక్కుంటూ వచ్చేలా చేస్తుంది. రాజారామ్ ఫ్యామిలీ అంతా కలిసి ముగ్గురు రౌడీలను చంపేసి, గొయ్యితీసి పాతేస్తారు. ఆ ముగ్గురులో శివ ఒకడు .. అతని జేబులోని పర్సులోనే వెయ్యి కోట్లకి సంబంధించిన 100 నోటు ఉంటుంది. ఆ 100 నోటు కోసం వరుణ్ రంగంలోకి దిగుతాడు. ఫలితంగా రాజారామ్ ఫ్యామిలీ ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందనేది మిగతా కథ. ఈ కథ మొదలైనప్పుడు .. ఓ తండ్రీ కూతుళ్ల అనుబంధానికి సంబంధించిన ఒక ఎమోషనల్ డ్రామా అనిపిస్తుంది. తమ పని తాము చేసుకుపోతున్న ఒక మిడిల్ క్లాస్ ఫ్యామిలీ చుట్టూ తిరిగే కథగా కనిపిస్తుంది.







Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455